# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక






సంపుటి : 01 | సంచిక : 85 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శనివారం, 21 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4




## ఓపెనింగ్ పేరుతో
# ఓవర్ యాక్షన్

- ప్రధాన రహదారిని బ్లాక్ చేసి హంగామా
- ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు
- ఇబ్బందులు పడిన ప్రజలు, ప్రయాణికులు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామలో ఏర్పాటు చేసిన సిబిఆర్ షాపింగ్ మాల్ ఓపెనింగ్‌కు వచ్చిన సినీనటి నిధి అగర్వాల్ శుక్రవారం పట్టణంలో సందడి చేశారు. అయితే ఓపెనింగ్ పేరు సదరు యజమానులు, ఆ సినీనటితో వచ్చిన ప్రైవేట్ బౌన్సర్లు చేసిన హంగామా అంతా ఇంతా కాదు. ఏకంగా ప్రధాన రహదారి అయిన పట్టణంలోని జనగామ - సిద్ధిపేట రోడ్డును బ్లాక్ చేసి ఓపెనింగ్ తతంగం కానిచ్చారు. దీంతో ప్రధాన రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పట్టణ కేంద్రానికి ఇతర పనులపై వచ్చిన జనాలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. షాపింగ్ మాల్ ఓపెనింగ్ సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న షాపులకు వెళ్లే దారులు మూసివేయడంతో కొనుగోలు దారులు అవస్థలు పడ్డారు. చివరకు స్థానిక పోలీసులు ట్రాఫిక్ రంగంలోకి దిగి రోడ్డు క్లియర్ చేశారు.



## మోడల్ మున్సిపాలిటీగా
# స్టేషన్‌ఘన్‌పూర్

- తాగునీరు, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి
- రూ.50 కోట్ల పనులను మార్చి నాటికి టెండర్లు పూర్తి చేయాలి
- ప్రజలకు నిజాయితీగా సేవలు అందించాలి
- వరంగల్ ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం

2లో






# స్టేషన్‌ఘన్‌పూర్‌ను మాడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తాం..

- తాగునీరు, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి
- రూ.50 కోట్ల పనులను మార్చి నాటికి టెండర్లు పూర్తి చేయాలి
- ప్రజలకు నిజాయితీగా సేవలు అందించాలి
- వరంగల్ ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం




**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** వచ్చే 5 ఏళ్లలో మనందరం కలిసి స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీని అభివృద్ధి చెందిన మున్సిపాలిటీగా అభివృద్ధి చేసుకుందామని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ మొదటి పురపాలక సంఘం సర్వసభ్య సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య , స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరితో పాటు జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధి, మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల అభివృద్ధి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, అధికారులు పట్టణాభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలపై, త్రాగు నీటి సరఫరా, పారిశుధ్యం సమస్యల పరిష్కారానికి పలు ప్రతిపాదనలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కావ్య మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని అన్నారు. స్టేషన్ ఘనపూర్‌ను 'మోడల్ మున్సిపాలిటీ'గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేయాలని, చేపట్టే ప్రతి అభివృద్ధి పని భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఉండాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను నోటి మాటగా కాకుండా డాక్యుమెంటేషన్‌తో అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని 18 ప్రధాన అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరిగిందని తెలిపారు. ప్రజాప్రతినిధులు నిత్య విద్యార్థుల్లా పనిచేస్తూ అభివృద్ధి సాధించాలని హితవు పలికారు. మున్సిపాలిటీకి వచ్చిన రూ.50 కోట్ల నిధులను ప్రాధాన్యత క్రమంలో వినియోగించి అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. డ్రైనేజీ సమస్యలు, అంతర్గత రోడ్ల మరమ్మతులు, వీధిదీపాల ఏర్పాటు వంటి పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగిస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా పేదలు, మహిళలు, వృద్ధుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా, జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని, వాటి పురోగతిపై క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, నేను, ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. మున్సిపాలిటీ నిధులను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే మరిన్ని నిధులు తెచ్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే మనందరి లక్ష్యం అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. వచ్చే 5ఏళ్లలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన మున్సిపాలిటీగా ఏర్పాటు చేయయాలని అందుకు ప్రజలు, అధికారులు సహకరించాలని తెలిపారు. ముఖ్యంగా అత్యధిక ప్రాధాన్యతగా తాగునీరు, పారిశుధ్య పనులపై ఎక్కువ దృష్టి సారించాలని అన్నారు. 2050 అవసరాలకు అనుగుణంగా త్రాగు నీటి సరఫరా పై డీటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ రూపొందించాలని అధికారులకు సూచించారు. అదేవిదంగా ప్రస్తుత అవసరాలకు అవసరమైన చర్యలు వేంటనే చేపట్టాలని ఆదేశించారు. మున్సిపాలిటీకి మంజూరు అయిన 50కోట్ల పనులకు సంబందించి మార్చి మొదటి వారం నాటికి అన్ని అనుమతులు తీసుకొని టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించాలని తెలిపారు.

వార్డు కౌన్సిలర్లు మీమీ వార్డులలో క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి రూ.50 లక్షల రూపాయల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అలాగే వార్డుకు 30ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి లిస్ట్ తయారు చేయాలని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీని అందరం కలిసి అభివృద్ధి చేసుకుందామని ఇందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. సోమవారం నాటికి పారిశుధ్య కార్మికులకు 3నెలల జీతం అందించనున్నట్లు తెలిపారు.



జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా మాట్లాడుతూ మున్సిపాలిటీ కి కేటాయించి న 50కోట్ల అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టడం తోపాటు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. వార్డులలో అన్ని పనులు ఒకేసారి చేపట్టాలెమని అలా చేస్తే ఏ పనిని కూడా పూర్తి చేయలేమని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలని తెలిపారు. అందరం కలిసి స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. కొత్తగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ , ఆర్డీఓ వెంకన్న, మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ, మున్సిపల్ చైర్మన్ వినయ్, వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.






## రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

**– కలెక్టర్ రిజ్వాన్ బాషా**

రఘునాథపల్లి, మన చౌరాస్తా : ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ రఘునాథపల్లి మండలంలోని గోవర్ధనగిరి గ్రామాన్ని సందర్శించి, వ్యవసాయ విస్తరణ అధికారి (AEO) ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని సమగ్రంగా సమీక్షించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాన్ని పరిశీలించి, అక్కడ జరుగుతున్న నమోదు విధానం, రైతుల హాజరు, అవసరమైన పత్రాల పరిశీలన తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమై, జాతీయ పథకం అయిన పీఎంకిసాన్ కింద ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు పురోగతిపై వ్యక్తిగతంగా విచారించారు. పథకాల లబ్ధులు సమయానికి అందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేయడం అత్యవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ స్వయంగా ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీని సృష్టించి, రైతులకు ప్రత్యక్షంగా విధానాన్ని వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీ అనేది ప్రతి రైతుకు ప్రత్యేకమైన యూనిక్ ఐడీగా ఉండి, రైతు వద్ద ఉన్న భూములన్నింటి వివరాలను అవి ఏ గ్రామం లేదా మండలంలో ఉన్నా సరే ఒకే వేదికపై సమగ్రంగా నమోదు చేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాల నుంచి అమలు చేయబడే అన్ని వ్యవసాయ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఈ ఐడీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా పారదర్శకత పెరుగుతుందని, డేటా సమగ్రత మెరుగుపడుతుందని, అర్హులైన రైతులకు నేరుగా లబ్ధి బదిలీ (DBT) వేగంగా మరియు ఖచ్చితంగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి పంచాయతీ కార్యదర్శులకు అదనపు లాగిన్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అలాగే, రైతులు స్వయంగా ప్రాథమిక వివరాలను నమోదు చేసుకునే విధంగా సౌకర్యం కల్పించి, తుది ధృవీకరణ మరియు ఆమోదం AEO ద్వారా చేయబడే విధానాన్ని అమలు చేస్తే, నమోదు ప్రక్రియ వేగవంతం అవుతుందని తెలిపారు. ఈ విధానం ద్వారా అధికారులపై పని భారం తగ్గి, రైతులకు సౌలభ్యం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అదనంగా, వ్యవసాయ యంత్రీకరణ ప్రాముఖ్యతను ఆయన విపులంగా వివరించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యాంత్రిక పరికరాల వినియోగం ద్వారా ఉత్పాదకత పెరుగుతుందని, సమయాన్ని, కార్మిక వ్యయాలను ఆదా చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న SubMission on Agricultural Mechanization (SMAM) పథకం పరికరాలను సబ్సిడీపై పొందవచ్చని రైతులకు తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను ప్రోత్సహించారు. రైతులు తమకు గ్రామంలోనే యూరియాఅందించాలని కోరగా.. స్పందించిన కలెక్టర్ డీఏవో, ఎఫ్పీవో ద్వారా అందిచటానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి పాల్గొన్నారు.

## ప్రార్థించే పెదవుల కన్నా.. సాయం చేసే చేతులే మిన్న..




**జనగామ, మన చౌరాస్తా :** ప్రార్థించే పెదవుల కన్నా.. సాయం అందించే చేతులే మిన్న అని జనగామ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి అన్నారు. శుక్రవారం ఇన్ఫోసిస్ సంస్థ అధిపతుల సుధా నారాయణమూర్తి ఆశయాల మేరకు హైదరాబాద్‌లో పనిచేస్తున్న రాపాక నాగరాజు, స్వాతి దంపతులు కళాశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం మూడు కంప్యూటర్లను బహూకరించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ల దాత స్వాతి మాట్లాడుతూ నేటి కాలంలో కంప్యూటర్స్ విద్య ఎంతో అవసరమని, తాను పుట్టి పెరిగిన ఈ ప్రాంతంలో ఉన్న కళాశాల విద్యార్థులకు కంప్యూటర్స్ అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఇంకా కొన్ని కంప్యూటర్స్ అందించి కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గట్టు వెంకటేశ్వర్లు, లయన్ డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్, మాశెట్టి సంతోష్, రామిని జగదీష్, పడకంటి రవీందర్ పాల్గొన్నారు.



# ప్రభుత్వ తీరుపై హరీశ్‌రావు గరం

- గోదావరిలో ప్రవాహం ఉన్నా ఎందుకు లిఫ్ట్ చేయడం లేదు?
- మాజీ మంత్రి హరీశ్‌రావు

**వరంగల్, మన చౌరాస్తా :** కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మాజీ మంత్రి , అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. గోదావరిలో సమృద్ధిగా నీటి ప్రవాహం ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ, తక్షణమే మోటార్లు పూర్తి సామర్థ్యంతో నడిపి మూడున్నర లక్షల ఎకరాలకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా దేవన్నపేట పంప్ హౌజ్‌ను పరిశీలించిన అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. దేవాదుల ప్రాజెక్టులో భాగమైన దేవన్నపేట పంప్ హౌజ్‌లో మూడు మోటార్లు పనిచేయకుండా బంద్ చేసి ఉంచడం తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. ఒకవైపు గోదావరి నదిలో సమృద్ధిగా నీటి ప్రవాహం ఉండగా, మరోవైపు రైతులకు అత్యవసరంగా నీళ్లు అవసరమైన ఈ సమయంలో మోటార్లు ఆఫ్‌లో ఉండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. సమ్మక్క సాగర్ వద్ద 16 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నప్పటికీ, దేవాదుల ద్వారా లిఫ్ట్ చేయకపోవడం వల్ల జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్ ప్రాంతాల్లో సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. గత ఏడాది కూడా మోటార్లు ఆన్ చేయకపోవడంతో సుమారు 60 వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని గుర్తు చేశారు.

## కాంగ్రెస్ హయాంలో నిర్లక్ష్యం..

బీఆర్ఎస్ ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును ప్రపంచ స్థాయి సదుపాయాలతో అభివృద్ధి చేసిందని హరీశ్‌రావు తెలిపారు. రామప్ప నుంచి ఉనికిచెర్ల వరకు 49.5 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణం పూర్తిచేసినట్లు, ఇది ప్రపంచంలోనే అతి పొడవైన టన్నెల్‌లలో ఒకటని పేర్కొన్నారు. అలాగే 155 మీటర్ల లోతులో నిర్మించిన దేవన్నపేట పంప్ హౌజ్ ప్రపంచంలోనే లోతైన పంప్ హౌజ్‌లలో ఒకటని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఈ ప్రాజెక్టుకు రూ. 7,300 కోట్లు ఖర్చు చేసి, 80 శాతం పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. 47 వేల ఎకరాల ఆయకట్టును 3.17 లక్షల ఎకరాలకు పెంచినట్లు, ఇంకా 2.40 లక్షల ఎకరాలకు నీరు అందించేందుకు తక్కువ భూసేకరణ, నిధులే అవసరమని వివరించారు. కానీ.. ఈ రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో కొత్తగా ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇవ్వలేదని, ఉన్న మోటార్లు కూడా నడపలేకపోతున్నారని విమర్శించారు. గత ఏడాది మెయింటెనెన్స్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల మోటార్లు ఆన్ కాలేదని, దీని ఫలితంగా వందల కోట్ల పంట నష్టం జరిగిందని ఆరోపించారు. అసెంబ్లీలో 12 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ నేతలు ఇప్పటివరకు ఆ లక్ష్యాన్ని సాధించలేదని ప్రశ్నించారు. రైతు బంధు చెల్లింపుల విషయంలో కూడా ప్రభుత్వం రోజుకో మాట చెబుతోందని విమర్శించారు. తెలంగాణ హక్కులను కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, కృష్ణా-గోదావరి జలాల వినియోగంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని హరీశ్ రావు విమర్శించారు. రైతుల ప్రయోజనాల కోసం బిఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, దేవాదుల ప్రాజెక్టు పూర్తిస్థాయిలో పనిచేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



# నర్సంపేటలో ఘనంగా సేవాలాల్ జయంతి

- పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే

**నర్సంపేట, మన చౌరాస్తా :** నర్సంపేట నియోజకవరంలో సంత్ సేవలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంత్ సేవలాల్ మహారాజ్ బంజారా సమాజానికి మార్గదర్శకుడిగా నిలిచి సమాజంలో ఐక్యత, నీతి, సేవా భావాలను పెంపొందించిన మహానుభావుడని పేర్కొన్నారు. ఆయన బోధనలు నేటి తరానికి కూడా ఆదర్శప్రాయమని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ సేవలాల్ మహారాజ్ చూపిన మార్గంలో సమాజ అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకొని బంజారా సమాజం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఉమారాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, బంజారా సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సేవలాల్ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.





# నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హుస్నాబాద్ నియోజకవర్గం పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచనలతో శనివారం భీమదేవరపల్లి మండలం ములుకనూర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్ ఏ.అప్పయ్య తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం4 గంటల వరకు నిర్వహించబడుతుందని ఈ శిబిరంలో జనగామ ప్రభుత్వ వైద్య కళాశాల నుండి(8 ) విభాగముల స్పెషలిస్ట్ వైద్యులు (జనరల్ మెడిసిన్, ఎముకల వైద్య నిపుణులు, స్త్రీ వైద్య నిపుణులు, చర్మ వైద్య నిపుణులు, కంటి వైద్య నిపుణులు, చెవి ముక్కు గొంతు ,పిల్లల వైద్య నిపుణులు, శస్త్ర చికిత్స నిపుణులు) సేవలందిస్తారని అలాగే ఉచితంగా మందులు అవసరమైన పరీక్షలు చేయడం జరుగుతుందని కావున మండలంలోని ప్రజలు ఈ వైద్య శిబిరంలో లభించే సేవలను వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్పర్సన్ చాహత్ బాజ్ పాయి, లతో కలసి జిల్లాలో పలు అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇన్నర్ రింగ్ రోడ్డు సంబంధించిన భూసేకరణ పెండింగ్ చెల్లింపులపై సమీక్షించి, సంబంధిత శాఖలు వెంటనే పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలన్నారు. రోడ్డు పనుల విషయంలో ఫేజ్ -1లో పూర్తైన పనుల పురోగతిని పరిశీలించి, ఫేజ్ -2లో రోడ్ల నిర్మాణానికి భూసేకరణకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వరంగల్ ఆర్డీవో సుమ, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





# నాణ్యమైన భోజనం అందించాలి

**హనుమకొండ, మన చౌరాస్తా :** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ హనుకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ అన్నారు. ఎస్ఎఫ్ఐ పరకాల మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్ ఆధ్వర్యంలో పరకాల పట్టణంలోని ప్రభుత్వ గర్ల్స్ స్కూల్‌ను శుక్రవారం సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళ్యాణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యతమైన భోజనం అందించాలని, అదేవిధంగా మెనూ పాటించాలని అన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ నాయకులు మహేష్ సందీప్ వినయ్ విద్యార్థులు పాల్గొన్నారు.



# ఉస్తాద్ నుంచి రేపు మరో సాంగ్ విడుదల

'గబ్బర్‌సింగ్' తర్వాత పవన్ కల్యాణ్, డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మార్చి 26న ఈ చిత్రం విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్‌లో జోష్ పెంచింది. ఇప్పటికే ఓ పాటను రిలీజ్ చేయగా.. తాజాగా 'ఆరా ఆఫ్ ఉస్తాద్' సాంగ్ ప్రోమోను పంచుకుంది. పూర్తిపాటను ఈ నెల 22న విడుదల చేయనుంది. విజువల్స్, మ్యూజిక్‌ని బట్టి ఈ సాంగ్ పవర్‌ఫుల్‌గా ఉండనున్నట్లు తెలుస్తోంది.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**